

# కథా కౌముది

## పెళ్ళి రాత్రికి అనగా.. డా.చెళ్ళపిళ్ళ సూర్యలక్ష్మి

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

'పుస్స్' అనే శబ్దంతో పొలమారింది, పెళ్ళిళ్ళ పేరయ్య రామశాస్త్రికి.

అతనికి మంచినీళ్ళందిస్తూ, "ఏమిటి శాస్త్రిగారూ, మా ఆవిడ మజ్జిగలో అల్లం, పచ్చిమిర్చి గట్టిగా దట్టించిందా ఏం?" అడిగాడు వేంకటేశ్వర్లు.

కొన్ని మంచి నీళ్ళు తాగి, మిగిలిన మజ్జిగ పూర్తి చేసి, 'త్రేవ్' మని త్రేంచి, కండువాతో నుదుటి మీదున్న చెమటను తుడుచుకుంటూ, "ఎంత మాటన్నారండీ ఎండాకాలంలో నాకు మజ్జిగ దానం చేసిన మహాతల్లిని? నేనులిక్కి పడింది మీరు పెళ్ళికొడుకులో కోరుకున్న లక్షణం గురించి", అన్నాడు రామశాస్త్రి.

"అంత కాని కోరికేం కోరానండీ బాబూ! మీ ఉలికిపాటు చూసినవాళ్ళెవారైనా నేను మిమ్మల్ని భయపెట్టానేమో అనుకుంటారు", అన్నాడు వేంకటేశ్వర్లు.

"భయం కాదూ మరి! మీరు మీ అమ్మాయికి సంపన్నుల సంబంధం తెమ్మనండి, తెస్తాను; ఆఫీసర్ సంబంధమా, సరే సరే! మీ కులం అబ్బాయిని వెతికి తెమ్మంటారా, ఇంకా సులభం; అమెరికా సంబంధం కావాలా, కొంత సమయం పడుతుంది; ఇల్లరికపుటల్లుడు కావాలా, దొరుకుతాడు. ఇవన్నీ వదిలేసి, క్రమశిక్షణాపరుడు అనే ఒక విశాలమైన పదాన్ని నా మీదకి వదిలేసి, అటువంటి సంబంధం తెమ్మంటే నా వల్లవుతుందంటారా?" గుక్క తిప్పుకోకుండా మాట్లాడి, మంచి నీళ్ళు గడగడా తాగేశాడు రామశాస్త్రి.

"అదా మీ కంగారుకి కారణం? హహహ! నేను ఒక మధ్య తరగతి కుటుంబీకుణ్ణి. ఓ మాస్టరుద్యోగం చేస్తున్నాను. సొంతిల్లుంది. సిగరెట్, తాగుడు, స్త్రీలోలత్వం లేనివాణ్ణి. అది నా క్రమశిక్షణ. ఉన్న ఒక్కగానొక్క కూతురికి అటువంటి అబ్బాయిని కోరుకోవడం తప్పు కాదుగా! మొన్నామధ్య మా పక్కింటి వాళ్ళబ్బాయి పాతికేళ్ళకే పోయాడు, కాన్సర్ తో. బాధ పడాల్సిన విషయమే. పక్కింట్లో ఉన్న పుణ్యానికి మేమెరిగిన విషయమేమిటంటే ఆ అబ్బాయి తెగ సిగరెట్లూదేసేవాడు. అదృష్ట వశాత్తు పెళ్ళి కాలేదుగానీ, అదే జరి గుంటే ఆ అమ్మాయి తన తప్పు లేకుండా అశుభసూచకం అయ్యుండేది. నా కూతురికి అలాంటి జీవితం వద్దు.

"తాగితే మనిషి పశువవుతాడని అందరికీ తెలుసు. కానీ, ఈ మధ్య 'సోషల్ డ్రింకింగ్' పేరిట పార్టీల్లో మగా, ఆడా కలిసి మందు కొట్టడం సర్వసాధారణమైపోయింది. నా పెంపకంలో పెరిగిన మా అమ్మాయి బీరు కోసం బారు చుట్టూ తిరగదు.

"మా బట్టలు ఇస్త్రీ చేసే చిన్నారావు ఏకంగా మరో స్త్రీని ఇంట్లోకే తెచ్చిపెట్టుకున్నాడు. ఆవిడ మాటల్లో పడి కొన్నాళ్ళకి భార్యాబిడ్డల్ని ఇంట్లోంచి తరిమేశాడు. ఇలాంటి వాణ్ణి చేసుకున్నా, చేసుకోకపోయినా ఒకటే.

"మా మూడో ఇంటిని మూణ్ణెల్ల క్రితం ఖాళీ చేసిన సుబ్బారావు గారు పేరు మోసిన ప్రైవేటు కంపెనీలో జనరల్ మేనేజర్. వాళ్ళ ఓనర్ ఎవరో వగలాడి వలలో పడి దివాలా తీసి, తన కంపనీలో పని చేసే వారి కుటుంబాలను రోడ్డుకీడ్చాడు.

"మా ఆఫీసర్ గారి డ్రైవర్ కొడుక్కి ఎంసెట్ లో ఇరవై వేల చిల్లర రాంక్ వస్తే, ఎక్కడా ఫ్రీ సీటు రాలేదు. వాళ్ళ నాన్నకి పైడ్ సీటు కొనే స్థోమతు లేదు. ఆ పిల్లవాడు చేసిన గోలకి తండ్రి స్వచ్ఛంద పదవీ విరమణ చెయ్యాల్సి వచ్చింది. ఎంతో మంచివాడైన ఆ డ్రైవర్ ఇలా ఉద్యోగం వదలడం మా అందరికీ బాధ తెచ్చింది. మా అమ్మాయికి పదిహేను వేల చిల్లర రాంక్ వస్తే తనకి ఇంజనీరింగ్ చదివే త్రాణ లేదని రుజువయ్యిందని, తనను బీకాంలో చేర్పించమని కోరింది. అదయ్యా మా పిల్ల మంచితనం. అందువల్ల, అందని వాటికి అర్రులు చాచే అబ్బాయి నాకొద్దు. ఉన్నదాంతో సంతృప్తి పడి, రెక్కల కష్టంతో ఇద్దరూ కలిసి, ఆడంబరాలకు పోకుండా తమ కుటుంబాన్ని నడుపుకుంటే చాలు. వయసుతో బాటు వాళ్ళూ వృద్ధిలోకి వస్తే చాలు.

"పెద్ద ఆఫీసరో, అందగాడో అవక్కరలేదు. క్రమశిక్షణాపరుడైతే చాలు", అంటూ ముగించాడు వేంకటేశ్వర్లు.

"అదక్కరలేదు-ఇదక్కరలేదు అంటూ చాలా పెద్ద లిస్టే ఇచ్చారండీ. ఆ ఏడుకొండలవాడి దయుంటే ఆ అబ్బాయి మనకు త్వరలోనే కనబడతాడు," అని బయలుదేరాడు రామశాస్త్రి.

★★★

మూడు నెల్ల తరువాత.....

"అయ్యా, మీ అంచనాలకు మించిన వరుడు దొరికాడండీ! జాతీయ బ్యాంకులో ఆఫీసరు. నోట్ల రద్దు విషయంలో అతని సహోద్యోగులు కక్కుర్తి పడినా ఇతను పడలేదట. అంటే, నిజాయితీపరుడన్న మాట. పెద్ద ఆఫీసరూ, అందగాడూను. ఫోటో చూస్తే మీరే ఒప్పుకుంటారు. అమ్మాయి ఉద్యోగం చేయకపోయినా ఫరవాలేదట. మీరూ మీరూ చూసుకుని, మాటలాడుకుని ఏ విషయం తేల్చుకుంటే బాగుంటుంది", అన్నాడు రామశాస్త్రి దాహం తీర్చుకుంటూ. "అమ్మాయిని వంటింటి కుందేలుని చేస్తాడా ఏమిటి?" అనుమానాస్పదంగా ఫోటో చూస్తూ అడిగాడు వేంకటేశ్వర్లు. "అన్నన్నా, ఎంత మాటండీ! మీరు అమ్మగారి చేత ఉద్యోగం చేయించలేదు; అంత మాత్రాన ఆవిణ్ణి అగౌరవ పరచలేదు కదండీ! అలాగే అనుకోండి!" అని జవాబిచ్చాడు రామశాస్త్రి.

జాతకాలు కుదిరాక మగ పెళ్ళి వారు సుజూకి స్విఫ్ట్ డిజైర్ కారులో వచ్చి పిల్లని చూసుకుని, రెండు రోజుల్లోనే అమ్మాయి నచ్చిందనీ, మాటలకి రమ్మనీ కబురంపారు. వేంకటేశ్వర్లు, భార్యా తీరా అక్కడికి వెళ్ళాక ఆడంబరంగా వివాహం జరిపించాలని పట్టుపట్టారు. రామశాస్త్రి అక్కడ గనక ఉన్నట్లతే వేంకటేశ్వర్లు అతణ్ణి వాళ్ళెదురుగానే నిలదీసి, మగ పెళ్ళివాళ్ళకి గుడ్ బై కొట్టి వచ్చేసేవాడు. ఇప్పుడు మధ్యవర్తి లేకపోబట్టి వాళ్ళు తమముందు కొట్టే గొప్పలన్నీ భరించల్సి వచ్చింది ఆ దంపతులకి. "మా అబ్బాయి ఉద్యోగానికీ, అందానికీ, మా కుటుంబపు స్థోమతు బట్టి ఎంతమంది అతని కోసం ఎగబడ్డారో తెలుసా! మా తదనంతరం ఈ భోగాలన్నీ మీ అమ్మాయికే సొంతం!" అని ఏవేవో చెప్పుకు పోతోంది పెళ్ళికొడుకు తల్లి. ముక్తాయింపుగా, "పెళ్ళికి మేమే పాతిక తులాల బంగారం పెడతాం. మీరు ఒక హోండా సిటీ కారు కొనిస్తే సరిపోతుంది", అని ఆవిడ ముగించింది.

"అమ్మా, మా గురించి రామశాస్త్రి గారు చెప్పలేదా?" అని అయిష్టంగా, నీళ్ళు నములుతూ అడిగాడు వేంకటేశ్వర్లు.

"చెప్పారే! మీకు ఇంకా మూడేళ్ళ సర్వీసుందనీ, సొంతింటి మీద అప్పులన్నీ తీరిపోయాయని!"

"క్షమించండి, అయన అసలు విషయం చెప్పకుండా మిమ్మల్ని శ్రమపెట్టాడు. మీకు తూగగలిగిన వాళ్ళం కామండీ!" అన్నాడు వేంకటేశ్వర్లు.

"అదేమిటండీ, మీ ఒక్క అమ్మాయికీ మేమింత చేస్తామంటే పది-పన్నెండు లక్షలకి చూసుకుంటున్నారు!" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"అది కాదండీ, మేము కొన్ని ఆదర్శాలని పాటిస్తాము. నిరాడంబరంగా ఉండాలన్నది మా ఉద్దేశ్యం. పెళ్ళి మీద ఇంత డబ్బు ఖర్చు చేసే బదులు ఏ వృద్ధాశ్రమానికో, అనాథ శరణాలయానికో విరాళమివ్వచ్చు; లేదా మన సంతోషాన్ని వాళ్ళతో పంచుకోవచ్చు. ఉన్న కారు సరిపోక పెద్దది కొనాలంటే అబ్బాయి లోను తీసుకుని కొనుక్కోవచ్చు కదండీ!"

"ఓ, ఈ విషయమా! దాని గురించి శాస్త్రి గారు చెప్పారు లెండి! అందరూ ఈ రోజుల్లో రూల్సు మాట్లాడుతూనే వాటిని ఉల్లంఘిస్తారు కదండీ! ఘనంగా పెళ్ళి చెయ్యకపోయినా, ఆడ పెళ్ళి వాళ్ళు ఖరీదైన బహుమతివ్వకపోయినా మా చుట్టాల్లో మాకు నగుబాటు! అందుకనే సూటిగా చెప్పేశాం", అంది పెళ్ళికొడుకు తల్లి.

ఇక చర్చ కొనసాగించి ప్రయోజనం లేదని వేంకటేశ్వర్లు, "మమ్మల్ని ఆలోచించుకోనివ్వండి", అని చెప్పి భార్య మంగతో సహా ఇంటికొచ్చాడు. ఈ విషయం పెళ్ళికూతురు అవనితో చెబితే, ఆమె తన తల్లిదండ్రులనే సమర్థించింది. ఆ సంగతి మగ పెళ్ళివాళ్ళతో చెప్పాలంటే రామశాస్త్రి ఊళ్ళో లేడాయె. ఈ సందిగ్ధంలో వీళ్ళున్నప్పుడు, పెళ్ళి కొడుకు తండ్రి ఫోన్ చేసి, జాతకాలు కుదరలేదని సారీ చెప్పాడు. పచ్చి అబద్ధం కానీ గొడవ వదిలిపోయిందని సంతోషించిందా కుటుంబం.

★★★

ఊరు నుండి వచ్చిన రామశాస్త్రి విషయం తెలుసుకుని పెళ్ళి వాళ్ళ డాబు గ్రహించనందుకు బాధపడి, కొన్నాళ్ళకి మరో సంబంధం తెచ్చాడు. "ఇదిగో, ఈ ఫోటో చూడండి! ఈ అబ్బాయి పేరు రామగోపాల్. రాముడిలాంటి వాడు. ఇంటరు చదువుతున్నప్పుడు తండ్రి పోతే, అక్కడితో చదువాపేసి, ప్రభుత్వంలో కారుణ్య నియామకం పుణ్యమా అని గుమాస్తాగా చేరి, ఇప్పుడు, ఇరవై ఏడేళ్ళ వయసుకి, ఈ మధ్యనే ఆఫీసరయ్యాడు. ఒక తమ్ముడు, ఒక చెల్లి. ఇద్దరినీ క్రమశిక్షణలో పెట్టి గొప్ప వారిని చేశాడు. చెల్లెలికి పోయినేడు పెళ్ళి చేసి ఈ ఏడు పురిటికి తీసుకొచ్చాడు. తమ్ముడు ప్రాజెక్ట్ నిమిత్తం అమెరికాలో ఉన్నాడు. చెడ్డ అలవాట్లు లేవు. స్త్రీలంటే బలహీనత లేదట. కట్నం కానీ అక్కరలేదు. మరీ పెద్ద అందగాడు కాదు. జాతకాలూ, అవీ చూడమంటారా?" అడిగాడు రామశాస్త్రి.

పెళ్ళి చూపుల్లో రామగోపాల్ ప్రవర్తించిన విధానం అందరినీ ఆకట్టుకుంది. తన చెల్లీ, బావ గారూ కూడా మగ పెళ్ళి వాళ్ళలా గిరి గీసుకుని భీష్మించుకోకుండా, కలుపుగోలుగా ఉన్నారు. అప్పటికప్పుడే తనకి అమ్మాయి నచ్చిందని, ఆమె అభిప్రాయం కనుక్కొని చెప్పమని వెళ్ళాడు. బాధ్యతాయుతుడుగా కనిపించి, బుద్ధిగా మసలుకున్న అబ్బాయి విషయంలో ఆడ పెళ్ళివాళ్ళకి ఏం అభ్యంతరముంటుంది? వెంటనే ఝామ్మని నిశ్చితార్థం జరిగిపోయి, పెళ్ళికి రోజులు దగ్గర పడసాగాయి.

రోజూ అమ్మాయీ, అబ్బాయీ తెగ మాట్లాడుకునేవారు. పెళ్ళిరోజు కోసం ఎదురు చూస్తూండే వారు. అప్పుడప్పుడు అవని కాబోయే ఆడబడుచు అంజలి తోనూ, కాబోయే అత్తగారితోనూ కూడా సంతోషంగా మాటలాడుతుండేది.

★★★

పెళ్ళికి రెండు రోజులు ముందుగా పెళ్ళివారు తరలి వచ్చారు. రామగోపాల్ తమ్ముడు నందగోపాల్ పెళ్ళి కోసమని సెలవు పెట్టి అమెరికా నుండి వచ్చాడట. పెళ్ళయిన తరువాతి రోజు మధ్యాహ్న భోజనం ఒక వృద్ధాశ్రమంలోనూ, మరుసటి రోజు ఉదయపు ఫలహారం ఒక అనాథ శరణాలయంలోనూ నిర్ధారింపబడ్డాయి.

రాత్రికి పెళ్ళనగా సాయంత్రానికి అవని తనకు ఈ పెళ్ళి వద్దని మొండి పట్టు బట్టింది. వేంకటేశ్వర్లు, మంగ నిర్ఘాంతపోయారు.

ఎవరూ లేకుండా తలుపులు బిడాయించి, ఆ కుటుంబం మంచి చెడ్డలు చర్చించుకున్నారు. "బుద్ధుండే ఈ మాటంటున్నావా?" అన్నాడు వేంకటేశ్వర్లు. "రోజూ ఇష్టంగానే గంటల తరబడి కబుర్లాడుకునే వారు కదే! ఇంతలోనే అతను ఎందుకు నచ్చలేదు?" అని గద్దించింది మంగ. ఎప్పుడూ మితభాషియై తన పని చేసుకునే మంగ ఇలా మాట్లాడడం విని అవని, వేంకటేశ్వర్లు ఆశ్చర్యపోయారు.

"ఇవ్వాళ నన్ను పెళ్ళికూతుర్ని చేసినప్పుడు అంజలి, నందు వచ్చి నాతో కొంత సేపు మాట్లాడారు కదా! ఆ తరువాత బరువైన మనసుతో ఈ నిర్ణయం తీసుకున్నాను".

"అర్థమయ్యేట్టు చెప్పు తల్లీ! వాళ్ళన్నయ్య సుఖపడకూడదని ఏమైనా కుళ్ళుబోతు పనులు చేశారా ఈ చిన్న పిల్లలు?" అడిగాడు వేంకటేశ్వర్లు.

"అబ్బే, అలాంటిదేమీ లేదు. పెళ్ళికొడుకు క్రమశిక్షణాపరుడైతే చాలుననుకున్నాం మనం. ఇతను క్రమశిక్షణ పేరుతో చెయ్యి చేసుకుంటాడట నాన్నా! తను ఆశించిన విధంగా మార్కులు రాకపోతే చెల్లెలిని, తమ్ముణ్ణి బెల్టుతో కొట్టేవాడట నాన్నా. చెప్పండి, ఎదిగొచ్చిన చెల్లెలిని, తమ్ముణ్ణి కొట్టే అతను రేపు నన్నూ, నా పిల్లల్నీ కొట్టడని ఏమిటి గారంటీ?"

"నువ్వన్నది నిజమే. కానీ, పెళ్ళి మండపంలో ఇలాంటి మాటలు మీ మధ్య ఎలా వచ్చాయే?" అడిగింది మంగ.

"అంజలి నా పూల జడ సరదాగా లాగి, ఏవో సర్దుబాట్లు చేయబోయింది. మీకు తెలుసుగా, ఎవరైనా నా జుట్టుని పట్టుకుంటే చిరాకని? అందుకే, మర్యాదగా నన్నడిగి నా జుట్టు పట్టుకోమన్నాను నేను. మాటవరుసకి అప్పుడామె, 'నన్ను కొట్టేటప్పుడు మా అన్నయ్య అడక్కుండానే నా జడ లాగి బెల్టుతో

కొట్టేవాడు', అంది. నేను షాక్ అయ్యాను. అప్పుడు నందు తన అనుభవాన్ని పంచుకున్నాడు. 'మీకు కోపం రాలేదా? మీరు బాధ పడలేదా?' అనడిగితే ఇద్దరూ, 'అన్నయ్య మా మంచి కోరే కదా అలా చేశాడు?' అని నన్ను ఎదురు ప్రశ్నించారు. సామదానభేదాలొదిలేసి ఈ దండనేమిటి అనుకున్నాను. నేను మాటలాడినంతలో వీళ్ళు దండనకి అర్థులైనంత మొండి వాళ్ళు కారు. తను అనుకున్న క్రమశిక్షణలో ఏపాటి లోపం ఉన్నా అతను సహించడట. మనం మెచ్చే అబ్బాయి ఒక అంతరించిపోతున్న జీవరాశి అనుకునేదాన్ని. ఇతను తారసపడినప్పుడు ఎంత సంతోషించానో మీకు తెలియనిది కాదు. ఇతన్ని పెళ్ళి చేసుకుని, తరువాత దెబ్బలు తిని, ఓడిపోయిన ఒక భార్యగా మనింటికి రావాలని లేదు. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు అని నేననుకుంటున్నాను. మీరేమంటారు? నేను కోరిన భర్త దొరక్కపోతే అంతరించిపోయిన జీవరాశిని కోరుకున్న ఒక మూర్ఖురాలిలా మిగిలిపోతాను. అంతేగా! కానీ, క్రమశిక్షణ పేరుతో దండనకు దిగే ఈ 'దండ'నాయకుణ్ణి చేసుకోడానికి మాత్రం నా మనస్సాక్షి ఒప్పుకోవట్లేదు. ఇక జరగాల్సిన విషయం గురంచి ఆలోచించాలి. ఒక చిన్న మనవి– నిజం చెప్పిన పుణ్యానికి పాపం అంజలి, నందూల పేర్లు బయటపెట్టకుండా జాగ్రత్త పడాలి", అంది అవని.

కాస్సేపు నిశ్శబ్దం తరువాత వేంకటేశ్వర్లు తేరుకుని, "నీ నిర్ణయం సబబైనదే. నువ్వు కోరినట్టే అంజలి, నందగోపాల్ పేర్లు బయటికి రావు. కానీ, దాన్ని ఈ సమయంలో చెప్పడం వల్ల వచ్చే చెడ్డ పేరు మాతోనే ఉండనీ. నువ్వు కోరుకునే జీవరాశి ఇంకా జీవించి ఉండాలని, నీకు దొరకాలని ఈ క్షణంలో నీ తండ్రిగా దేవుణ్ణి ప్రార్థిస్తాను", అని మంగతో కలిసి మగపెళ్ళివారి విడిది వైపు వెళ్ళాడు.

★★★★★★★

**Click here to share your comments on this story**